స్కెచ్

# అడిగినా పెట్టని ఆదరణ

వై. వి. శర్మ

ఉన్నవాళ్ళని చూస్తే, లేనివాళ్ళకు ఈర్ష్య, అసూయ ఏర్పడటం సహజమే. మనమనుకుంటూన్న పెట్టుబడీదారీవర్గం, కార్మికవర్గం— ఈ రెండింటిమధ్యా యెప్పుడూ సంఘర్షణే. ఒక వర్గాన్నొకవర్గం పాలించాలని ఉబలాటం. వర్గ వైషమ్యాలకు స్థానంలేని సమాజమే మనం కోరవలసినదీ; కోరుతున్నదీకూడా!

సూరన్ననాయుడు ఆ ఊరిపెద్దకాపు. పెట్టుబడీదారివర్గంలో ఒకడని సామాన్య ప్రజల అంచనా. పూర్వంరోజుల్లో ప్రతీగ్రామానికీ, ఒక "పెద్ద" ఉంటూండటం, ఆ "పెద్ద" చెప్పిన తీర్పులకి గ్రామంకట్టుబడి పాలిస్తూండటం జరుగుతూండేది. కాని ఈ ఆధునాతన కాలంలో ఎవరికి వారే పెద్దలు. తీర్పుచెప్పినా వినరు. ఎంతకమ్యూనిజం పల్లెలలో ప్రాకిందని మనమనుకున్నా, పెట్టుబడీదారివర్గసంచలనం ఇంకా పోలేదంటే, ఏమంత ఆశ్చర్యపడాల్సిన విషయంకాదు. ఎందుచేతంటే మన సమాజం ఇంకా ఆ స్థితినందుకోలేదు.

నాయుడుచాలా ఠీవిఅయిన మనిషి. తన మీసాలంటే అతనికెంతో గర్వం. చాలాపదవులలంకరించాడు. కొంచెం వయసుమళ్ళినవాడేనని చెప్పాలి. చిన్నతనంలో కొంచెం పోకిరీగా తిరిగాడని చెప్పుకుంటూంటారు. ఇప్పుడా గ్రామపెద్దల్లోలెఖ్క. చిన్నచిన్న తగాయిదాలువస్తే తాను "జడ్జి"గా వ్యవహరించగల స్తోమతు ఉన్నవాడు. అతని కంఠధ్వనిలో ఏదో బరువుఉండేది. సామాన్యంగా ఈరోజుల్లో ఎక్కువగా వేదాంతం మాట్లాడుతాడు. చాలా గుండెనిబ్బరమైన మనిషి కూడా పదిమందివరకూ ఉంటారు. ఆ బాపతులోవాడే వెంకడు. చాలా హీనపరిస్థితులలో జీవితం గడుపుతున్నాడు. యువకుడు, తక్కువకులంలో జన్మించినా, విద్యాజ్ఞానం అంటకపోయినా, పెద్దలంటే యెంతో గౌరవం, వినయంచూపుతూ ఉంటాడు. అనవసర విషయాల్లో జోక్యం కల్గించుకోడు. ఒకసారి నాయుడుతో మనవిచేసుకున్నాడు. "బాబూ, మళ్ళీయేడు ఒక ఎకరమేనా యిప్పించాలి" అని.

"అలాగే చూద్దాం" అన్నాడు నాయుడు అంతే. వెంకడి సంతోషానికి అంతేలేదు. భూదేవినే నమ్ముకుని, తమ జీవితాలనే అంకితంచేస్తున్న రైతాంగాని కంతకంటే యేం కావాలి? ఈరోజుల్లో మనం సామాన్యంగా ఏవో రాజకీయాలు మాట్లాడుతూనే ఉంటాం. కాని వెంకడివరసే వేరు—దీని కంతకీ ముఖ్యకారణం వాడిభార్య సుబ్బి; నల్లటిశరీరం బొద్దుగా ఉంటుంది. ఎర్రటి కావిరంగుచీర ధరించి, నల్లటి జాకెట్టుతొడిగి అది వీధివెంట వెడ్తూంటే... చూడముచ్చటేస్తుంది.

పల్లెవాతావరణంలో జీవితం కాలప్రమాణం తెలీకుండానే గడిచిపోతుంది. పచ్చటి వరిచేలు చూస్తూంటే యేవో నూత్న అనుభూతులను ఆకళించుకుంటుంది మన మనస్సు. ఆ పొలాల పచ్చదనంల్లో, పల్లెవాసుల నిర్మల వాతావరణం, ప్రతిబింబిస్తున్నట్లగపడుతుంది. కంచలో గంజిపోస్తూ ఉప్పులో అద్దిన పచ్చిమిరపకాయ చేతికందిస్తూ, సుబ్బి, "ఏంట్రా నావంట్లో చూత్తే, ఏం బాగాలేదు; ఆ డాక్టరుగాడ్ని రమ్మంటే డబ్బడుగుతాడు. ఎలా సచ్చేదిరా?" అంది. వెంకడేం మాట్లాడలేదు. చివరకు సుబ్బి విసుక్కుంటూ, "కొంత గంజి కాచిపోసే దిక్కేలేదు. ఎదవలు! ఒక్క యెదవ ఉపకారానికిరాడు. ఒరేయ్, నాయుడుగారియ్యాల్సిన డబ్బు పట్టుకురాకూడదంట్రా...నోరెట్టి అడగాలి గావోసు!" అని యీసడించింది. "నోర్ముయ్యి! పెద్దోళ్ళకే పేర్లెడుతున్నావు. అనవసరంగా మాట్లాడావంటే బొమికలిరుగుతాయి తెలుసా..." అంటూ వెళ్ళిపోయాడు వెంకడు.

ఏదో అడిగితీరాలి తప్పదను కున్నాడు. అడిగాడు "ఏరా వెంకా! నేనేం ఎగేస్తా ననుకున్నావా? అయినా నీభార్య జబ్బుకోసమని ఇదివరకే పదిరూపాయ లప్పుజేశావ్? ఇంకేం వస్తుందిరా?" అన్నాడు నాయుడు.

"ఏదో మా రాజులు రక్షించాలి. పేదోళ్ళం బాబూ, మా సుబ్బి కడుపులో పోట్లంట! ఇపరీరీతంగా బాధపడ్తాంది. దాన్ని సూత్తుంటే గుండె తరుక్కుపోతాది. ఏదో ఒక్క అయిదురూపాయ లుంటే దయచేయించండి బాబూ" అని బ్రతిమాలాడు.

ఏదో ఆలోచిస్తున్నవాడిలా నాయుడు "అరినీ తస్సాదియ్యా, నేను మొన్నిచ్చిన పదిరూపాయలయిపోయాయన్నమాటే! మాకంటే యెక్కువగా ఖర్చుచేస్తున్నారురా... అయినా మొండికెత్తారులే! పట్నంల్లో ఉన్న కుర్రాడికి డబ్బు పంపాలంటే కానీ అప్పుపుట్టటంలేదూ... ఏదో గడిపేసేయి" అని కసిరాడు నాయుడు.

"డాక్టరుబాబుతో నేనా చెప్పాలి తమరు. మీరు చెప్తే యింటారు బాబూ! పేదోళ్ళ కేకలు బూడిదలో పోసిన పన్నీరేనండి" అన్నాడు వెంకడు.

"ఏదో నేను మొగమాటానికయినా, ఆయన్ని పిలిపించుకోలేకపోతున్నా; నీవిషయం ఒకటి చెప్పనా...ఫో"అని కసిరాడు.

దీనవదనంతో వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు వెంకడు. అడిగినా పెట్టని ఆదరణ నాయుడిది.

"ఎంతచేసినా, డబ్బున్నవాళ్ళదే చెల్లుతుంది యీ కాలంల్లో" అనుకున్నాడు వెంకడు.

చిరిగిన తుండు తలకుచుట్టుకుంటూ, సుబ్బితో అన్నాడు, "మన కష్టాలెవరిక్కావాలి. ఏదో ఈ రసం త్రాగు"అని. సుబ్బి మూలుగుతూంది. నొప్పి యెక్కువైంది. 'అమ్మో'అంటూ ప్రక్కనున్న నులకమంచంమీద పడిపోయింది. ఆరోజు ఎలాగో గడిచింది. మర్నాడు సుబ్బి తలిదండ్రులొచ్చి, వాళ్ళఊరు తీసుకెళ్ళారు.

కూలీ యిచ్చినా, యివ్వకపోయినా, పని చేయాల్సిందే. తనదొక పాలేరుజీవితం. ఎదురు తిరిగి మాట్లాడడానికి వీలులేదు. యంత్రంమాదిరిగా పనిచెయ్యాల్సిందే. వెంకడు కన్నీళ్లుకారుస్తూనే పనిచేస్తున్నాడు. ఒకపూటనుండి తిండిలేదు. తన సుబ్బికెలావుందో అని ఆవేదన. అతని ఎండిన శరీరంచూస్తే, కొందరికి నికృష్టంగా కనపడొచ్చు కాని, నిజంగా దారిద్ర్యం అలా రూపొందిందే అని తెలుస్తుంది. "ఏరా సరీగ్గా పనిచెయ్యవేరా" అని కసిరాడు నాయుడు.

"ఈయేళ చెయ్యలేను బాబూ;నా సుబ్బి..." అంటూండగా "నోర్ముయ్. పనిచేసి తీరాల్సిందే" అని గద్దించాడు సూరన్నకాపు. ఒప్పుకున్న ప్రకారం పనిచెయ్యాల్సిందే. పని ముగించుకుని, ఆ పూట కూలీయమన్నాడు. "చిల్లర లేదులే. సంతరోజున కనపడు" అన్నాడు నాయుడు. "నిన్నటినుండి యింట్లో గింజలులేవు బాబయ్యా! ఒక తవ్వెడు బియ్యపు నూకలేనా యిప్పించండి" అని బ్రతిమాలాడు వెంకడు. ఎలాగో వినుకుంటూ ఆ నూక లిచ్చాడు నాయుడు.

వెంకడు ఇంటి ముఖం పట్టాడు ఒక పూట తిని, ఒకపూట పస్తుండి కట్టుకు నేందుకు బట్టలేక... ఇలా ఎంతకాలం జీవించడం? వెంకడిలో అసహనం బయలుదేరింది. అసహాత్యం ప్రబలింది. చాలామంది ఓదార్చారు. ఆవేశంతో రాత్రి తెల్లవార్లూ బాధపడ్డాడు. తన భార్య పడే బాధ కళ్ళారా చూస్తూ. . .బ్రతికుండేం? చస్తేం? కాని ఎంత వెదకినా సమాధానం దొరికిందికాదు. . .

తెల్లవారింది. వెంక డింటిముందు జనసమూహం ప్రోగయింది. ఏదో అఘాయిత్యం జరిగిందనుకున్నారు ప్రజలు. నాయుడు వాళ్ళందరినీ తోసుకుంటూ లోపలకు వచ్చాడు. పాకనడి నుండి వెంకడి శవం వ్రేళ్ళాడుతూంది. "ఉరి పోసుకు చచ్చాడు;పూర్వం ఏంపాపంచేశాడో!" అన్నారు తెలుసున్నవాళ్ళంతా. "ఏదైనా కష్టాలుంటే, నాతో చెప్పుకోకూడదూ, ఏమిటీ పిచ్చివాడు. . .అయినా కర్మ అలా వ్రాసి ఉంది. బుద్ధిః కర్మానుసారిణి అని ఊరికే అన్నారూ మన ఆర్యఋషులు? పాపం! వట్టి అమాయకుడు' అన్నాడు నాయుడు ధీమాగా, నాయుణ్ణి ఉదారుడు అన్నది లోకం; ఆత్మహత్యకు కేసు లేదంది యీ ప్రభుత్వం; నాయుడు యిప్పటికీ ఆ ఊరికి పెద్దే. నాయుడి హృదయం లోతెరుంగని పాతాళం అని తెలియదెవ్వరికీ. . .